క్లుప్తంగా

మద్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్



పోలీసులు స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లు

మల్కాపురం: గుట్టుచప్పుడుకాకుండా ద్విచక్ర వాహనంపై మద్యం తరలిస్తున్న వ్యక్తిని మల్కాపురం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మల్కాపురం సీఐ గొలగాని అప్పారావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. యారాడ మార్గంలో ఆదివారం వాహనాల తనిఖీ చేపట్టామన్నారు. ఆ సమయంలో యారాడ ప్రాంతానికి చెందిన బాయిన ఈశ్వరరావు అనే వ్యక్తి వాహనం తనిఖీ చేశారు. ఓ సంచిలో 55 మద్యం సీసాలను గుర్తించారు. వాటిని యారాడ బెల్ట్‌షాపునకు తరలిస్తున్నట్టు విచారణలో తెలుసుకున్నారు. దీంతో ఆ వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ శ్రీనివాసరావు. ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి



మొక్కలు నాటుతున్న జేడీ ఫౌండేషన్ సభ్యులు

గోపాలపట్నం: జీవీఎంసీ 89వ వార్డు పరిధి చంద్రనగర్ రోడ్డుకు ఇరువైపులా ఆదివారం జేడీ ఫౌండేషన్ సభ్యులు మొక్కలు నాటారు. రామాలయం నుంచి అండర్ పాస్‌వే వరకు పలు రకాల మొక్కలు వేశారు. ఇవి నీడతో పాటు ఆక్సిజన్ అందిస్తాయని చెప్పారు. సభ్యులు ఒక్కో మొక్కను సంరక్షించే బాధ్యత తీసుకున్నారు. ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్క అయినా పెంచాలని కోరారు. రావి, తెల్ల మద్ది, తురాయి, దేవ కాంచన తదితర మొక్కలు నాటారు.

పేరుకే 30 పడకల ఆస్పత్రి



ఆస్పత్రిలో మిగిలిన మూడు మంచాలు



60వ వార్డులో ఎఫ్‌ఆర్‌యూ ముఖద్వారం



మల్కాపురం: అది పేరుకే 30 పడకల ఆస్పత్రి.. అందులో ఉన్నవి మూడంటే మూడే మంచాలు. మిగిలిన వాటిలో కొన్ని మాయం కాగా.. మరికొన్ని మెట్ల కింద తుప్పు పట్టి దర్శనమిస్తున్నాయి. పారిశ్రామిక ప్రాంత పేద రోగుల పాలిట సంజీవనిగా పేరుగాంచిన ఈ ఆస్పత్రికి నేడు ఇలాంటి దుస్థితి వస్తుందని ఎన్నడూ.. ఎవరు కనీసం ఊహించ లేదు. గతంలో ప్రతి రోజూ 350 నుంచి 500 వరకు ఓపీ నమోదవ్వగా.. ప్రస్తుతం 20 నుంచి 30 మందికే పరిమితమైంది. ఇక్కడ రానురాను సౌకర్యాలు మాయమవడంతో ఈ పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం ఈ ఆస్పత్రిలో అరకొర సిబ్బందితోనే వైద్య పరీక్షలు చేస్తున్నారు. దీంతో ఇక్కడ రోగులు పడుతున్న బాధలను పట్టించుకునే నాథులే కరువయ్యారు.

పారిశ్రామిక ప్రాంత పేదల కోసం..

జీవీఎంసీ 60వ వార్డు శ్రీహరిపురం గుల్లలపాలెంలో 40 ఏళ్ల కిందట పారిశ్రామిక ప్రాంతంలోని 58, 59, 60 వార్డుల్లో నివసిస్తున్న పేద రోగులకు మెరుగైన ఉచిత వైద్యం అందించేందుకు జీవీఎంసీ అధికారులు ఫస్ట్ రిఫరల్ యూనిట్(ఎఫ్‌ఆర్‌యూ) ఆస్పత్రిని ఏర్పాటు చేశారు. కాలక్రమేణా రోగుల సంఖ్య పెరగడంతో దీనిని 30 పడకల ఆస్పత్రిగా తీర్చిదిద్ది.. పలువురు వైద్య నిపుణులు, శస్త్రచికిత్సల కోసం ప్రత్యేక శీతల గదిలో ఆపరేషన్ థియేటర్, సాధారణ వైద్య చికిత్సల కోసం ప్రత్యేక గది ఇలా పలు వసతులు కల్పించారు. ఈ ఆస్పత్రి వెనుక గల గదుల్లో వివిధ జీవీఎంసీ అధికారుల కార్యాలయాలు ఏర్పాటు చేయడంతో వాటిలో ఉన్న మంచాలను మూలన పెట్టేశారు. 2013 జూన్‌లో ప్రభుత్వ కార్యాలయాలకు కేటాయించిన గదులపైన అదనపు గదులను నిర్మించి, వాటిలో ప్రసూతి వైద్యశాల, ఆధునిక వసతులతో చిల్డ్రన్స్ వార్డు, రోగుల కోసం అదనపు గదులు ఏర్పాటు చేశారు. కొన్నేళ్ల పాటు ఇవి రోగులకు ఎంతో సౌకర్యవంతంగా నిలిచాయి. అయితే ఈ ముచ్చట ఎంతో కాలం నిలవలేదు.

వార్డుల గదులకు తాళాలు

ఆస్పత్రిలో 2013లో నిర్మించిన వార్డుల గదులకు నేడు తాళాలు వేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. అవసరమైన వైద్య నిపుణులు లేకపోవడం, అన్ని రకాల మందులు లభించకపోవడం, ఐసీయూ, ఆపరేషన్ గదుల్లోని పరకరాలు పనిచేయకపోవటం వంటి సమస్య లతో పాటు ఆస్పత్రికి జనరేటర్ సదుపాయం లేకపోవడం కారణంగా రోగులకు వైద్య సేవలందడం లేదు. దీంతో ప్రస్తుతం ఇది పేరుకు మాత్రమే 30 పడకల ఆస్పత్రిగా మిగిలింది. ఈ ఆస్పత్రికి పూర్వ వైభవం తీసుకువచ్చి పేదలకు అన్ని రకాల వైద్య సేవలందించాలని స్థానికులు, రోగులు కోరుతున్నారు.



తాళం వేసి ఉన్న ఐసీయూ గది



శిథిలమైన చెక్క బల్లలు



ఆస్పత్రి మెట్ల కింద పడి ఉన్న తుప్పపట్టిన మంచం



ఎఫ్‌ఆర్‌యూ మేడపైన మూసివేసిన చిల్డ్రన్స్ వార్డు

వైభవంగా వేంకటేశ్వరస్వామికి పూజలు



ములగాడ హౌసింగ్‌కాలనీలో పూజలు చేస్తున్న భక్తులు

మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతంలోని వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో ఆదివారం తొలి ఏకాదశి సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. శ్రీదేవి,భూదేవి సమేత వేంకటేశ్వరస్వామిని విశేషంగా అలంకరించారు. మల్కాపురం దరి ప్రకాష్‌నగర్‌లోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామికి పంచామృతాలతో అభిషేకాలు చేపట్టారు. అనంతరం మహిళలు గోవింద నామాలను పఠించారు. మధ్యాహ్నం భక్తులకు అన్న ప్రసాదాలను వడ్డించారు.

ఐవోసీ చింతామణి దుర్గాగణపతి ఆలయంలో కొలువుదీరిన వేంకటేశ్వరస్వామికి,ములగాడ హౌసింగ్ కాలనీలోని వేకటేశ్వరస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

బీవీ పట్టాభిరామ్‌కు ఘన నివాళి



పట్టాభిరామ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కళాసేవా పీఠం సభ్యులు

గోపాలపట్నం: ప్రపంచ ప్రఖ్యాత ఇంద్రజాలికుడు, సైకాలజిస్ట్ బీవీ పట్టాభిరామ్ చిత్రపటానికి పూల మాలలు వేసి గోపాలపట్నం కళా సేవా పీఠం సభ్యులు నివాళులర్పించారు. ఇక్కడి కళాసేవా పీఠం కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో పీఠం అధ్యక్షుడు గొరపల్లి బంగారురాజు మాట్లాడుతూ ఆయన వ్యక్తిత్వ వికాస నిపుణుడిగా చేసిన సేవ గొప్పదని కొనియాడారు. భారత దేశ ఖ్యాతిని ప్రపంచ దేశాలకు విస్తరించా రని అన్నారు. కార్యక్రమంలో నందవరపు సోము లు, సీనియర్ సభ్యుడు ప్రకాశరావు, చందు సుబ్బారావు, కె.నూక రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

61వ వార్డులో సీఐటీయూ మహాసభ



మహాసభ నిర్వాహణలో పాల్గొన్న సీఐటీయు నాయకులు తదితరులు

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు వెంకన్నపాలెం వద్ద గల సీఐటీయూ కార్యాలయం వద్ద ఆదివారం సాయంత్రం సీఐటీయూ మల్కాపురం జోన్ పరిధి 10వ మహాసభ జరిగింది. ఈ కార్యక్రమానికి సీఐటీయూ జిల్లా అధ్యక్షులు కె.ఎం.శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు నూకరాజు తదితరులు హాజరై సీఐటీయూ జెండాను ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సభలో నాయకులు మాట్లాడుతూ, కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల వల్ల దేశంలోని పలు ప్రభుత్వ, ప్రైవేట్ రంగాలలో పని చేస్తున్న కార్మికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆరోపించారు. మోడీ సర్కార్ ప్రవేశపెట్టిన లేబర్ కోడ్స్‌ను తక్షణమే రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ నెల 9వ తేదీన దేశ వ్యాప్తంగా జరగనున్న సమ్మెను జయ ప్రదం చేయాలని ఈ సందర్భంగా కార్మికులకు పిలుపునిచ్చారు.కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఎస్.ప్రసాద్, కె.పెంటారావు, ఎస్.ఉమా తదితరులు పాల్గొన్నారు.

ఏం సాధించారని 'తొలి అడుగు'



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు, పార్టీ పశ్చిమ సమన్వయకర్త మళ్ల విజయప్రసాద్

- హామీల అమల్లో కూటమి విఫలం
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు
- 61వ వార్డులో 'బాబూ ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ' కార్యక్రమం



సమావేశంలో పాల్గొన్న పార్టీ కార్యకర్తలు, నాయకులు

మల్కాపురం : ఎన్నికల హామీలను నెరవేర్చడంలో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని, తమ తప్పులను కప్పిపుచ్చుకోవడానికి 'తొలి అడుగు' వంటి కార్యక్రమాలతో సూపర్ సిక్స్ హామీలను అమలు చేశామని డబ్బా కొట్టుకుంటున్నారని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కె.కె. రాజు తీవ్రంగా విమర్శించారు. పార్టీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మళ్ల విజయప్రసాద్ ఆధ్వర్యంలో 61వ వార్డు మల్కాపురంలోని మరడిమాంబ కల్యాణ మండపం వద్ద ఆదివారం సాయంత్రం 'బాబు ష్యూరిటీ - మోసం గ్యారెంటీ' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా దివంగత నేత డాక్టర్ వై.ఎస్. రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ' రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో' క్యూఆర్ స్కానర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కేకే రాజు, మళ్ల విజయప్రసాద్ మాట్లాడుతూ సూపర్ సిక్స్ హామీలను అమలు చేశామని సంబరంగా తొలి అడుగు నిర్వహిస్తున్న కూటమి నాయకులకు కొన్ని ప్రశ్నలు సంధించారు. 'మీరు రాష్ట్ర మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించారా? ఏడాది అవుతున్నా ఆ హామీ ఏమైంది? ఉచిత గ్యాస్ డబ్బులు ఇప్పటివరకు ఎంత మందికి ఇచ్చారో చెప్పగల ధైర్యం మీకు ఉందా?' అని నిలదీశారు. 'తల్లికి వందనం పథకం కొందరికే సొంతమైందని, మిగిలిన తల్లులకు కన్నీరే మిగిలిందని' వారు ఆవేదన వ్యక్తం చేశారు. 'ఏడాదికి లక్ష ఉద్యోగాలు గాలిలో కలిసిపోయాయని, ఉన్న ఉద్యోగాలకే ఎప్పుడూ ఊడుతాయో అన్న అయోమయ పరిస్థితి నేటి ఉద్యోగుల్లో ఉందని' పేర్కొన్నారు. నిరుద్యోగ భృతి అటకెక్కిందని, రాష్ట్రంలో పలు ప్రాంతాల్లో రోడ్లు చెరువులను తలపిస్తున్నాయని విమర్శించారు. అమరావతిలో రాజధాని నిర్మాణం ఒక్క ఇటుక కూడా పడలేదని, పోలవరం ప్రాజెక్టు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్టుందని దుయ్యబట్టారు. వారి పాలన పబ్లిసిటీకి ఎక్కువ, సుపరిపాలనకు తక్కువ అని వివరించారు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత అభివృద్ధి మాట అటుంచితే, అమాయకులైన ఆడపిల్లలపై దాడులు, మద్యం విచ్చలవిడిగా అమ్మకాలు, గంజాయి అక్రమ రవాణా, ప్రజాధనం వృథా వంటి అనేక అంశాలు వారి ఖాతాలో ఉన్నాయని ఆరోపించారు. కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, కార్పొరేటర్లు పీవీ సురేష్, గుండపు నాగేశ్వరరావు, బల్లా లక్ష్మణరావు, గులివిందల లావణ్య, నాయకులు పేడాడ రమణికుమారి, ఉరుకూటి చందు,ఆల్ఫాకృష్ణ, మాజీ కార్పొరేటర్లు పిల్లా కన్నబాబు, గల్లా శ్రీను, పలు వార్డుల అధ్యక్షులు ఆడారి శ్రీను, అప్పలరాజు, దొడ్డి లక్ష్మి, చుక్క ప్రసాద్‌రెడ్డి, అప్పలస్వామి నాయుడు, గులిగిందల కృష్ణ, రేవళ్ల సత్యనారాయణ, అంగ వర్మ, పిలక రామ్మోహన్‌రెడ్డి (రాము), భీశెట్టి గణేష్, ఏ.రాజు (కేబుల్ రాజు),దొడ్డి కిరణ్,మహిళ అధ్యక్షురావు పేడాడ జ్యోత్స్న, ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు అనీల్‌కుమార్, జిల్లా అంగన్‌వాడీ విభాగ అధ్యక్షురాలు సర్వసిద్ధి శ్రీలత, జిల్లా లీగల్ సెల్ అధ్యక్షుడు నాయుడు, ఎస్సీ సెల్ నాయకుడు పూండి మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వుడాకాలనీ నూతన కార్యవర్గం

మల్కాపురం: జీవీఎంసీ 60వ వార్డు గుల్లలపాలెం వుడాకాలనీ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం ఆదివారం స్థానిక అసోసియేషన్ భవనంలో నిర్వహించారు. సమావేశం అనంత రం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కాలనీ అధ్యక్షుడిగా గుంటూరు బంగార్రాజు, ఉపాధ్యక్షుడిగా అడవాల జయరామారావు, ప్రధాన కార్యదర్శిగా కొదమ శ్రీనివాసరావు,కోశాధికారిగా దివాకర్‌రావును ఎన్నుకున్నారు.నూతనంగా ఎన్నికైన పాలక వర్గ సభ్యులు మాట్లాడుతూ కాలనీలో సభ్యుల అందరి సంక్షేమం కోసం శ్రమిస్తామన్నారు. పలు వసతు లు కల్పించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. నూతన కార్యవర్గాన్ని వార్డు కార్పొరేట ర్ పి.వి.సురేష్ అభినందించారు.

వావ్.. వాట్ ఏ డాగ్స్



తమ పెంపుడు కుక్కలతో యజమానులు

గోపాలపట్నం: ఆదివారం భీమిలిలోని పశువైద్యశాల ప్రాంగణం 'డాగ్ షో'ను తలపించింది. ప్రపంచ జూనోసిస్ డే సందర్భంగా యాంటీ రాబిస్ టీకా కార్యక్రమం జరిగిందన్న మాటే గానీ, అక్కడ చేరుకున్న శునక మహారాజులు, రాణీలను చూసి జంతు ప్రేమికులు పులకించిపోయారు. ఒకటా రెండా.. ఎన్నెన్నో బ్రీడ్‌లు.. గతంలో ఎన్నడూ చూడని రకరకాల కుక్క జాతులు ఒకే చోట దర్శనమివ్వడంతో అక్కడి వాతావరణం కనుల పండుగగా మారింది. డాల్మిన్ కోకర్స్ పేనియల్, జర్మన్ స్పిట్జ్, షిట్జ్, పెకింగేజ్, లాబ్రడార్ రిట్రీవర్, లాబ్రడార్ డాగ్ వంటి ఖరీదైన, అపురూపమైన శునకాలు ఇక్కడ విచ్చేశాయి. 'వావ్.. వాట్ ఏ డాగ్' అని అబ్బురపడుతూ చాలామంది వాటిని నిమిరి మురిసిపోయారు. ఈసారి టీకా కార్యక్రమానికి వచ్చిన కుక్కల సంఖ్య గతంలో కన్నా చాలా ఎక్కువగా ఉండటంతో ఆస్పత్రి వర్గాలు ఆనందం వ్యక్తం చేశాయి. 'మా ఆసుపత్రికి ఇంతటి బడా స్టార్స్ వస్తారని ఊహించలేదు' అంటూ లోలోపల సంతోషపడ్డాయి. కుక్కల యజమానులు తమ పెంపుడు జంతువులను సొంత పిల్లల్లా ఎత్తుకొని, జాగ్రత్తగా చూసుకుంటూ కనిపించారు. టీకా కార్యక్రమం పండుగలా, శునకాల ప్రదర్శనలా సాగింది.

పెంపుడు జంతువుల ఆరోగ్యంపై శ్రద్ధ అవశ్యం

పెంపుడు జంతువుల పెంపకంలో ప్రేమతో పాటు వాటి ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలని ప్రభుత్వ విప్ గణబాబు అన్నారు. గోపాలపట్నం ప్రాంతీయ పశువుల ఆసుపత్రిలో ప్రపంచ జూనోసిస్ డే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా గణబాబు మాట్లాడుతూ, పెంపుడు జంతువుల పెంపకంలో వచ్చిన మార్పులను గుర్తు చేస్తూ, గతంలో రేకుల షెడ్‌లో ఉన్న పశువుల ఆసుపత్రికి పక్కా భవనం నిర్మించినట్లు తెలిపారు. ఇటీవల ఈ ఆసుపత్రి అభివృద్ధికి కృషి చేసిన ఏడీ రవికుమార్‌ను అభినందించారు. రూ.1.20 లక్షల విలువైన మందుల కిట్లను పెంపుడు కుక్కల యజమానులకు సంయుక్త సంచాలకులు డాక్టర్ కరుణాకరరావు ఉచితంగా అందించారు. సుమారు 612 కుక్కలకు వ్యాక్సిన్ వేసినట్లు వైద్యుడు రవికుమార్ తెలిపారు. ఉప సంచాలకులు డా. చంద్రశేఖర్, డీఎంహెచ్‌వో డా. జగదీష్ ప్రసాద్, డా. మదీనా ప్రసాదరావు, జి. రాజేష్, ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



పెంపుడు కుక్కకు టీకా వేస్తున్న డాక్టర్ సునీల్

పెంపుడు కుక్కలకు టీకాలు

సింథియా: జీవీఎంసీ 40వ వార్డు గాంధీగ్రామం పశువుల ఆస్పత్రి ఆవరణలో ఆదివారం వరల్డ్ జూనోసిస్ డేను పురస్కరించుకుని డాక్టర్ సునీల్ కుమార్ ఆధ్వర్యంలో పెంపుడు కుక్కలకు యాంటీ ర్యాబిస్ టీకాలను ఉచితంగా అందజేశారు. కార్యక్రమాన్ని వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు ప్రారంభించారు. సుమారు 200 కుక్కలకు టీకాలు వేసినట్లు డాక్టర్ సునీల్‌కుమార్ తెలిపారు.



జర్మన్ స్పిట్జ్



డాల్మిన్ కోకర్స్ పేనియల్



డాల్మేషియన్



వ్యాక్సినేషన్‌ను ప్రారంభిస్తున్న విప్ గణబాబు



అలరించిన షిట్జ్



లాబ్రడార్ రిట్రీవర్

ఇందిరానగర్‌లో కార్డన్ సెర్చ్



ఇందిరానగర్‌లో పోలీసులు స్వాధీనం చేసుకున్న మద్యం సీసాలు

గోపాలపట్నం: ఇందిరానగర్‌లో గోపాలపట్నం పోలీసులు ఆదివారం వేకుజామున కార్డన్‌సెర్చ్ చేపట్టారు. దీనిలో భాగంగా రెండు ఇళ్లల్లో 26 క్వార్టర్ బాటిళ్లు స్వాధీనం చేసుకుని ఇద్దరిని అరెస్ట్ చేశారు. అలాగే సుమారు 80 వాహనాలను తనిఖీ చేయగా అందులో ఎటువంటి పత్రాలు లేని 5 వాహనాలను సీజ్ చేశారు. ఈ సందర్భంగా గోపాలపట్నం సీఐ ఎస్‌వీ ప్రభాకర్ మాట్లాడుతూ నగరంలో నేర నియంత్రణలో సీపీ శంకబ్రతబాగ్చి ఆదేశాల మేరకు ఆకస్మిక తనిఖీలు చేస్తున్నామన్నారు. ఎవరైనా నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. వాహనాలకు సరైన పత్రాలు ఉంచుకోవాలని, పత్రాలు లేని వాహనాలు వాడవద్దని అన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు అప్పలనాయుడు, రామారావు, సిబ్బంది పాల్గొన్నారు.